E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: HYDERABAD,JANGAON సంపుటి :01 సంచిక :157 మంగళవారం 10 నవంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

టపాసుల మోత.. కంటి గాయాల పోటు!



బాణసంచాతో 32 మందికి కంటి గాయాలు

ఆరుగురికి తీవ్ర గాయాలు

బాధితుల్లో చిన్నారులే అధికం

ఒకరి పరిస్థితి విషమం

సరోజినీ ఆసుపత్రికి బాధితుల క్యూ

అత్యవసర వైద్యానికి ఆసుపత్రి సిద్ధం

స్థానిక పోరులో కూటమి క్లీన్‌స్వీప్!



2024 కంటే మెరుగైన ఫలితాలు

పట్టణాల్లో 59 శాతం ఓట్లతో ఆధిక్యం

94 శాతం స్ట్రైక్ రేట్ నమోదు

వైసీపీపై 25.34 శాతం ఓట్ల ఆధిక్యం

అభివృద్ధికి ప్రజల ఆమోదం: చంద్రబాబు

ఎన్నికల ఖర్చులు తగ్గడం శుభపరిణామం

సేవాభావంతో రాజకీయాల్లోకి రావాలి

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అఖండ విజయాన్ని అందించారని సీఎం చంద్రబాబు అన్నారు. 2024 ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. ప్రజల నుంచి లభించిన ఆదరణకు ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఈ విజయంతో రాష్ట్ర ప్రజలు తన ఆలోచనలకు అనుగుణంగా తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంతాల్లో కూటమికి 59 శాతం ఓట్లు వచ్చాయని, 94 శాతం స్ట్రైక్ రేట్ నమోదైందని వెల్లడించారు.

అండాల దందాపై మహిళా కమిషన్ ఫైర్!

ఐదు ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు

సుమోటోగా కేసు నమోదు

కమిషన్ ఎదుట హాజరైన నిర్వాహకులు

ఆసుపత్రుల రికార్డుల సమగ్ర పరిశీలన

నిబంధనల ఉల్లంఘనపై ఆరా

మహిళలను మోసగించారా? కోణంలో విచారణ

బాధితులకు న్యాయం చేస్తామన్న కమిషన్

ఓటమి దెబ్బకు ట్రంప్ యూటర్న్!



ఎన్నికల దెబ్బకు ట్రంప్ స్వరం మార్పు

ఇమ్మిగ్రేషన్ పాలసీ కఠినమని అంగీకారం

డెమోక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

ఆరు నెలలు విమర్శలకు దూరంగా ఉంటా

వలసల కఠిన చర్యలతో నష్టమని ఒప్పుకోలు

పాత వలసదారుల బహిష్కరణపై ప్రజల్లో ఆందోళన

ట్రంప్ వ్యాఖ్యలపై కొనసాగుతున్న ఉత్కంఠ

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మార్చారు. తన ప్రభుత్వ వలస విధానం (ఇమ్మిగ్రేషన్ పాలసీ) చాలా కఠినంగా ఉందని అంగీకరించారు. రాబోయే రోజుల్లో డెమోక్రటిక్ పార్టీతో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఎన్నికల ఫలితాల అనంతరం సీబీఎస్ '60 మినిట్స్' కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. అక్రమ వలసలపై తమ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు ఎన్నికల్లో ఒకవైపు మేలు చేసినా, మరోవైపు నష్టం కూడా కలిగించాయని అంగీకరించారు. సరిహద్దులను మూసివేయడం, నేరస్థులను దేశం నుంచి పంపించివేయడం వంటి అంశాల్లో తనకు మంచి మార్కులు పడ్డాయని, అయితే ఏళ్ల తరబడి అమెరికాలో స్థిరపడి, మంచి ఉద్యోగాలు చేస్తూ, పన్నులు కడుతున్న వారిని కూడా దేశం నుంచి బహిష్కరించడం (డిపోర్టేషన్) పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమైందని తెలిపారు.



భాగ్యలక్ష్మి ఆలయానికి భక్తజనసంద్రం!

చార్మినార్‌లో పండుగ సందడి

భక్తుల కోసం 10 క్యూ లైన్లు

మూడు రోజుల పాటు భారీ రద్దీ

ఆలయం వద్ద భారీ బందోబస్తు

చార్మినార్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

వాహనదారులకు పోలీసుల కీలక సూచనలు

పండుగ వేళ కాలుష్య జ్వాల!



- దీపావళితో పెరిగిన వాయు కాలుష్యం!
- విషపూరితంగా మారిన భాగ్యనగరం గాలి!
- పటాకుల మోతతో పెరిగిన పీఎం2.5!
- ఐటీ కారిడార్‌లో ప్రమాద ఘంటికలు!
- 600 దాటిన ఏక్యూఐ స్థాయులు!
- ఢిల్లీలో విషవాయువుల కోరలు!
- గ్యాస్ చాంబర్‌ను తలపిస్తున్న రాజధాని!
- హైదరాబాద్‌ను వెంటాడుతున్న కాలుష్య భయం!
- మరో ఢిల్లీగా మారనున్న భాగ్యనగరం?

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): ఐటీ హబ్‌గా, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ ఇప్పుడు కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. ఒకప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణానికి పేరుగాంచిన భాగ్యనగరంలో ప్రస్తుతం స్వచ్ఛమైన గాలి కరువవుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం నగరవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా హైదరాబాద్ నగరంపై దీపావళి పండుగ ప్రభావం పడింది. పలుచోట్ల పెద్దఎత్తున పటాకులు కాల్చడంతో నగరంలో గాలి నాణ్యత భారీగా క్షీణించి కాలుష్యం ఒక్కసారిగా పెరిగింది. గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లో ఏక్యూఐలో 160 పాయింట్లకు గాలి నాణ్యత పడిపోయి కాలుష్యం 410 పాయింట్లకు చేరినట్లు సమాచారం.

మిగతాది 2 లో..

డీపీఆర్ లేదు.. టెండర్లు పిలిచారా?



డీపీఆర్ లేకుండానే టెండర్లు

ప్రజలు లేని పబ్లిక్ హియరింగ్

మూసీపై కేటీఆర్ ఫైర్

కరువు వేళ సుందరీకరణా?

తుగ్లక్ పాలనంటూ విమర్శలు

ప్రాజెక్టుపై స్పష్టతకు డిమాండ్

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): తెలంగాణ ప్రభుత్వం మూసీ సుందరీకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్టు అమలు తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఎలాంటి ముందుచూపు లేకుండా, ప్రజలకు నష్టం జరిగేలా చర్యలు ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. తాజాగా.. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తీరుతోపాటు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం కాకుండానే టెండర్లు పిలవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

బాకీలన్నీ తీర్చేస్తాం.. అంబటి మాస్ వార్నింగ్!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): అవన్నీ బాకీనేనని, తాము వచ్చిన తర్వాత తీర్చేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన నేపథ్యంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల వరకే రాజకీయం.. ఆపై అభివృద్ధి!



కరీంనగర్ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి

బండి సంజయ్‌తో కలిసి పనిచేస్తాం

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి

జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు

అసంపూర్తి మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి


ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలబెడతామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత వ్యక్తిగత రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రయోజనాలు, జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాకు అవసరమైన అభివృద్ధి

2 లో

రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు!



కోర్టు ధిక్కరణకు రూ.2 వేల జరిమానా

ఆదేశాలు బేఖాతరు చేయడంపై ఆగ్రహం

60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

గడువు దాటినా స్పందించని కలెక్టర్

ఉద్దేశపూర్వక ఉల్లంఘనగా నిర్ధారణ

అప్పీలుకు నాలుగు వారాల గడువు

2 లో

పండుగ వేళ.. కాలుష్య జ్వాల!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ ఏకంగా 600 పాయింట్లను దాటడం కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

దీపావళి తర్వాత మరింత దిగజారిన పరిస్థితి..

ఇప్పటికే కాలుష్య సమస్యతో సతమతమవుతున్న హైదరాబాద్‌కు దీపావళి వేడుకలు గాలి నాణ్యతను మరింత దెబ్బతీసింది. పండుగ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటినా పటాకులు కాల్చడం కొనసాగింది. బంజారాహిల్స్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, ఎస్‌ఆర్ నగర్, అమీర్‌పేట్, సోమాజిగూడ ప్రాంతాల్లో టపాసుల మోతతో గాలిలో పొగ, ధూళి కణాల సాంద్రత పెరిగింది. దీపావళి రాత్రి 9.30 గంటల సమయంలో హైదరాబాద్ నగర సగటు ఏక్యూఐ 509 పాయింట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు 392 మైక్రోగ్రాములుగా నమోదైంది. సాధారణంగా పేర్కొన్న 60 మైక్రోగ్రాముల పరిమితితో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అలాగే పీఎం10 స్థాయిలు కూడా 326 మైక్రోగ్రాములకు చేరినట్లు సమాచారం. సాధారణ పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం నమోదవుతున్న స్థాయిలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ఉదయానికి నగర సగటు ఏక్యూఐ 160 పాయింట్లుగా నమోదైంది.


దేశ రాజధాని ఢిల్లీలో గ్యాస్ చాంబర్‌ను తలపిస్తున్న పరిస్థితి..

ఇదిలా ఉంటే దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరింత ప్రమాదకరంగా మారింది. నగరాన్ని దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్య నియంత్రణ కమిటీ గణాంకాల ప్రకారం.. నవంబర్ 9 తెల్లవారుజామున పంజాబీ బాగ్ ప్రాంతంలో పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు ఏకంగా 993 మైక్రోగ్రాములకు చేరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన 24 గంటల సగటు మార్గదర్శక పరిమితి 15 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది దాదాపు 66 రెట్లు అధికం. ఆర్.కే. పురంలో 61.6 రెట్లు, వివేక్ విహార్‌లో 58.2 రెట్లు అధికంగా కాలుష్యం నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. బురారీ క్రాసింగ్‌లో ఏక్యూ×ఐ 441, రోహిణిలో 430 పాయింట్లుగా రికార్డయ్యాయి. ఆనంద్ విహార్, బవానా ప్రాంతాల్లో పర్యవేక్షణ కేంద్రాల డేటా అందుబాటులో లేకపోవడంతో వాస్తవ పరిస్థితిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

మరో ఢిల్లీగా హైదరాబాద్?:

హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, నిర్మాణ పనుల నుంచి వెలువడే దుమ్ము, రోడ్లపై పేరుకుపోయిన ధూళి, పారిశ్రామిక ఉద్గారాలకు పండుగ కాలుష్యం తోడవడంతో పరిస్థితి చేయి దాటుతోంది. దీపావళి ప్రభావంతో తాజాగా గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో ప్రభుత్వం, అధికారులు తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లేక పోతే అతి త్వరలోనే హైదరాబాద్ కూడా మరో ఢిల్లీగా మారే ప్రమాదం ఉందని నిపుణులు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అండాల దందాపై మహిళా కమిషన్ ఫైర్!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): రాష్ట్రంలో కలకలం రేపిన అండాల అక్రమ సేకరణ వ్యవహారాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఉదంతంపై మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి విస్తృత విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదు ప్రముఖ ఫెర్టిలిటీ సెంటర్లకు మహిళా కమిషన్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అండాల సేకరణలో చట్ట నిబంధనలు పాటించారా లేదా? బాధిత మహిళల ఆరోగ్య భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసుల మేరకు సంబంధిత ఐదు ఫెర్టిలిటీ కేంద్రాల నిర్వాహకులు కమిషన్ ఎదుట హాజరయ్యారు. తమ ఆసుపత్రుల్లో జరిగిన అండాల సేకరణ విధానం, రోగుల వివరాలు, ఇతర సాంకేతిక సమాచారాన్ని అధికారులకు అందజేశారు.

రికార్డుల సమగ్ర పరిశీలన..

నిర్వాహకులు సమర్పించిన నివేదికలతో పాటు, ఆయా 5 ఫెర్టిలిటీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను మహిళా కమిషన్ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా అక్రమాలు జరిగాయా? మహిళలను మోసగించి అండాల సేకరణకు పాల్పడ్డారా? అనే కోణంలో విచారణ వేగవంతం చేశారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

ఓటమి దెబ్బకు ట్రంప్ యూటర్న్!

మొదటి పేజీ తరువాయి

వారితో కలిసి పనిచేయడానికి సిద్ధం:

ఇమ్మిగ్రేషన్ అంశంపై కలిసి పనిచేయడానికి కొందరు డెమోక్రాట్లు ఇప్పటికే తనను సంప్రదించారని, ఒప్పందం కుదరడానికి అవసరమైతే ఆరు నెలల పాటు డెమోక్రటిక్ నేతలను విమర్శించకుండా ఉండటానికి కూడా తాను సిద్ధమేనని ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు తన ఇమ్మిగ్రేషన్ విధానం మరీ కఠినంగా ఉందని ట్రంప్ అంగీకరిస్తూనే మరో వైపు ఎన్నికల ఫలితాల అనంతరం డెమోక్రటిక్ పార్టీతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ఆయన ప్రకటించడం అమెరికా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

మాటలకే పరిమితమా?:

ఇమ్మిగ్రేషన్ పాలసీ కఠినంగా ఉందంటూ ఓ వైపు ట్రంప్ స్వయంగా అంగీకరించినప్పటికీ.. అమెరికా అధికారులు మాత్రం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలోనే అమెరికా ఇమిగ్రేషన్ విధానాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన స్టీవెన్ మిల్లర్ హాట్ కామెంట్స్ చేశారు. మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ.. దేశంలో నేరాలకు పాల్పడే అక్రమ వలసదారులను ఏరివేసే ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని స్పష్టం చేశారు. దీంతో ట్రంప్ వ్యాఖ్యలు కేవలం మాటలకే పరిమితం కాబోతున్నాయా లేక వలస విధానంలో ఏదైనా మార్పులు చోటు చేసుకోబోతున్నాయా అనేది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

డీపీఆర్ లేదు.. టెండర్లు పిలిచారా?

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగ్ నిర్వహించారని, డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లను ఆహ్వానించారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు, ప్రాజెక్టు సమగ్ర వివరాలు లేకుండా ఇంత భారీ ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్తారని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, నీటి సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంటూ, ఇలాంటి సమయంలో సుందరీకరణ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. ప్రజల అవసరాలు, ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్తున్నారని ఆరోపించారు.

"ప్రజలు లేకుండా పబ్లిక్ హియరింగ్.. డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లు పిలవడం.. ఇందులో విద్దూరం ఏంటంటే, రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో 'సుందరీకరణ' పేరుతో హడావుడి చేయడం. ఇది తుగ్లక్ ప్రభుత్వం కాకపోతే మరేం అనాలో అర్థం కావడం లేదు" అంటూ కేటీఆర్ తన ట్వీట్‌లో వ్యాఖ్యానించారు.

మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశంగా మారింది. అయితే ప్రాజెక్టు వ్యయం, అమలు ప్రణాళిక, పునరావాసం, పర్యావరణ ప్రభావం, ప్రజాభిప్రాయ సేకరణ వంటి అంశాలపై రాజకీయంగా చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రాజెక్టు వివరాలు, టెండర్ల ప్రక్రియపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అయితే ఆయన చేసిన ఆరోపణలపై ప్రభుత్వ స్పందన ఏవిధంగా ఉంటుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

స్థానిక పోరులో కూటమి క్లీన్‌స్వీప్!

మొదటి పేజీ తరువాయి

జెడ్పీటీసీ ఎన్నికల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కూటమికి మంచి ఫలితాలు వచ్చాయని సీఎం చెప్పారు.

'పోస్టల్ బ్యాలెట్‌లోనూ కూటమికి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూటమికి 60 శాతం ఓట్లు వచ్చాయి. పరిషత్ ఎన్నికల్లోనూ వైసీపీతో పోలిస్తే కూటమికి 30 శాతానికి పైగా అధిక్యం దక్కింది. ఉద్యోగుల ఓట్లు కూడా కూటమికి గణనీయంగా వచ్చాయి. 2024 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 55.3 శాతం ఓట్లు రాగా.. వైసీపీకి 39.81 శాతం ఓట్లు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో కూటమికి 58.9 శాతం, వైసీపీకి 33.56 శాతం ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 25.34 శాతం పాయింట్లు. 2024తో పోలిస్తే కూటమి అధిక్యం కూడా పెరిగింది' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

'నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో మంచి రాజకీయాల ద్వారా సుపరిపాలన అందించాలనే నమ్మకంతో ముందుకు సాగుతున్నా. నా నమ్మకాన్ని ప్రజలు మరోసారి నిజం చేశారు. 2024లోనూ, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ కూటమికి మెరుగైన ఆదరణ అందించారు. అభివృద్ధికి ఆమోదం, సుపరిపాలనకు గౌరవంగా ఈ ఎన్నికల ఫలితాలను భావిస్తున్నా. రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. తుఫాన్ ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో సహాయక చర్యలను కొనసాగించాము. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు కూడా కూటమికి వచ్చిన మద్దతును ప్రతిబింబిస్తున్నాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఎన్నికల్లో డబ్బు పంపిణీ, అనవసర ఖర్చులకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉంది. డబ్బు ఖర్చు చేయడానికి బదులుగా నాయకులు సేవాభావంతో ప్రజల ముందుకు రావాలి. ఎన్నికల ఖర్చు తగ్గడం శుభపరిణామం. ఖర్చులు తగ్గితే నాయకుల్లో సేవాభావం పెరుగుతుంది. ఎన్నికల్లో పెట్టిన డబ్బును తిరిగి సంపాదించుకోవాలనే ఆలోచనకు రాజకీయ నాయకులు దూరంగా ఉండాలి. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో పనిచేసే నాయకత్వం పెరగాలి. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలి. ప్రజలకు సేవ చేయడమే రాజకీయాల ప్రధాన లక్ష్యంగా ఉండాలి' అని సీఎం చెప్పుకొచ్చారు.

టపాసుల మోత.. కంటి గాయాల పోటు!

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): దీపావళి పండుగ వేళ బాణసంచా సంబరాలు పలువురి జీవితాల్లో విషాదాన్ని నింపాయి. టపాసులు కాల్చే సమయంలో ప్రమాదవశాత్తు పలువురు కంటి గాయాలపాలయ్యారు. హైదరాబాద్‌లోని మెహదీపట్నం ప్రభుత్వ సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి ఇప్పటివరకు 32 మంది బాధితులు చికిత్స కోసం వచ్చినట్లు ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఇబ్రహీం వెల్లడించారు.

ఆరుగురికి తీవ్ర గాయాలు.. చిన్నారులే ఎక్కువ

ఆసుపత్రికి వచ్చిన 32 మందిలో ఆరుగురికి కంటి గాయాలు తీవ్రంగా ఉండటంతో వైద్యులు ఆసుపత్రిలో చేర్చుకున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. ఆసుపత్రిలో చేరిన ఆరుగురిలో నలుగురు చిన్నారులు ఉండగా, మిగిలిన ఇద్దరిలో ఒకరు పెద్దవారు ఉన్నట్లు పేర్కొన్నారు. స్వల్ప గాయాలతో వచ్చిన మిగతా బాధితులకు ప్రథమ చికిత్స అందించి, అవసరమైన మందులు సూచించారు. తదుపరి వైద్య పరీక్షల కోసం మళ్లీ ఆసుపత్రికి రావాలని సూచించి పంపించారు.

అత్యవసర వైద్యానికి ఆసుపత్రి సిద్ధం

రానున్న రోజుల్లో దీపావళి సంబరాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో బాధితుల సంఖ్య కూడా పెరగవచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సరోజినీ దేవి కంటి ఆసుపత్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆర్ఎంఓ స్పష్టం చేశారు.

పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ ఇబ్రహీం సూచించారు. చేతిలో పట్టుకుని బాణసంచా కాల్చడం, ప్రమాదకరమైన విన్యాసాలు చేయడం వంటి పనులకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు.

భాగ్యలక్ష్మి ఆలయానికి భక్తజనసంద్రం!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): చారిత్రాత్మక చార్మినార్ పరిసర ప్రాంతాలు భక్తజనసందోహంతో నిండిపోయాయి. పండుగ సంబరాల వేళ ప్రముఖ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల తాకిడి విపరీతంగా పెరగడంతో చార్మినార్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీతో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

10 క్యూ లైన్లలో దర్శనాలు.. 3 రోజుల పాటు ప్రత్యేక రద్దీ

ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు కమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా 10 క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. భక్తులు ఎలాంటి తోపులాట లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేలా చర్యలు చేపట్టారు. రాబోయే మూడు రోజుల పాటు ఆలయానికి భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చార్మినార్ మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్స్.. పోలీసుల కీలక సూచన

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చార్మినార్ పరిసర ప్రాంతాల్లో రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చార్మినార్ వైపు వెళ్లే ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. చార్మినార్ మీదుగా ప్రయాణించే వాహనదారులు, స్థానికులు ఈ ట్రాఫిక్ ఆంక్షలను గమనించి తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులు ఉన్నవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని పోలీసులకు సహకరించాలని సూచించారు.

బాకీలన్నీ తీర్చేస్తాం.. అంబటి మాస్ వార్నింగ్!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): అవన్నీ బాకీనేనని, తాము వచ్చిన తర్వాత తీర్చేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన నేపథ్యంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై కూటమి నేతలు దాడులు చేసి అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గుంటూరులో ఎప్పుడూ లేని సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తాము సెలైంట్‌గా వైసీపీ కేడర్ మాత్రం ఒప్పుకోదన్నారు. 1989 నుంచి రాజకీయాల్లో ఉన్నామని, గుంటూరులో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని అంబటి రాంబాబు తెలిపారు. దుష్ట సంప్రదాయాన్ని గుంటూరులో చూస్తున్నామని, అక్రమంగా తమపై కేసులు పెడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నించిన వైసీపీ నేత అప్పిరెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తన తర్వాత ఎవరినీ వదిలిపెట్టమని అంబటి రాంబాబు హెచ్చరించారు.

రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు!

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (తెలుగు గళం): న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను బేఖాతరు చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా హైకోర్టు నిర్ధారించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు కలెక్టర్‌కు 6 నెలల పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును 4 వారాల పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

అసలు ఏం జరిగిందంటే..?

రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు దాఖలు చేసిన వినతిని పరిశీలించాలని గతంలో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. 2025 ఆగస్టులో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 60 రోజుల్లోగా ఆ వినతిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, కోర్టు నిర్దేశించిన 60 రోజుల గడువు ముగిసినప్పటికీ కలెక్టర్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ నమోదైన తర్వాతే యంత్రాంగం కదిలింది. అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. ఆ తర్వాత జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే ఇలా ప్రక్రియను చుట్టేయడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఉల్లంఘనపై విచారణ.. సంచలన తీర్పు

న్యాయస్థానం ఆదేశించిన సమయంలో స్పందించకుండా, పిటిషన్ దాఖలయ్యాక నామమాత్రంగానే ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన హైకోర్టు, కలెక్టర్ ఉద్దేశపూర్వకంగానే కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని స్పష్టం చేస్తూ ధర్మాసనం కఠిన నిర్ణయం తీసుకుంది.

ఎన్నికల వరకే రాజకీయం.. ఆపై అభివృద్ధి!

మొదటి పేజీ తరువాయి

పనులను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కృషి చేస్తామని పొన్నం తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ, గోదావరి జలసంపద వంటి వనరులు జిల్లాకు అపారమైన అభివృద్ధి అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని సమర్థంగా వినియోగించుకుంటూ పారిశ్రామిక రంగం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.


విద్యారంగంలో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు భీమదేవరపల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశామని, జమ్మికుంట, హుస్నాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు వైద్య సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, కొత్తకొండ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎలగందుల ఖిల్లాతోపాటు ఇతర పర్యాటక ప్రాంతాలు, జలవనరుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామన్నారు. కరీంనగర్ నగరంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం దాదాపు వెయ్యి కొత్త పోస్టుల ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

కరీంనగర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్థిక మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరినట్లు పొన్నం వెల్లడించారు. ప్రజలకు సంబంధించిన ఉమ్మడి సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన పనులపై జర్నలిస్టులు కూడా సూచనలు చేస్తూ భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీలైనన్ని నిధులు తీసుకొచ్చి ఉత్తర తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాగా ఉమ్మడి కరీంనగర్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా జిల్లా అభివృద్ధికి పాటుపడటం తన బాధ్యతని, ప్రజల ఆశీర్వాదంతో ఆ బాధ్యతను నెరవేరుస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

విద్యార్థుల హక్కుల సాధనే లక్ష్యంగా ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నికకు శ్రీకారం!

- మాదిగ విద్యార్థుల ఐక్యతే బలం.. వెంకటాపురంలో ఎంఎస్ఎఫ్ కమిటీ ఎన్నిక సమావేశం! • విద్యార్థి సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి -- యాసం రమేష్ మాదిగ పిలుపు!



తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), నవంబర్ 09:

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ములుగు జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి చాళ్లల రమేష్ మాదిగ పిలుపుతో వెంకటాపురం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) నూతన మండల కమిటీ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు చెన్నం తిరుపతి మాదిగ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వెంకటాపురం మండల అధ్యక్షులు యాసం రమేష్ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కుల సాధన, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మాదిగ విద్యార్థులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే సామాజిక చైతన్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ పేద విద్యార్థులకు విద్యా అవకాశాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఎంఎస్ఎఫ్ నిరంతరం కృషి చేయాలని అన్నారు. ప్రతి గ్రామం నుంచి విద్యార్థులను సంఘంలో భాగస్వాములను చేస్తూ వెంకటాపురం మండలంలో ఎంఎస్ఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల ఎంఎస్పీ అధ్యక్షులు కొడాలి సత్యం మాదిగ, యాసం శివ భాస్కర్ మాదిగ, చెన్నం అఖిల్ మాదిగ, వేల్పుల శ్రీశాంత్ మాదిగ, గౌతమ్ మాదిగ, సన్నీ మాదిగ, రాజు మాదిగ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం, మానవ ఆరోగ్య పరిరక్షణ”



సత్తుపల్లి/వేంసూరు, నవంబర్ 09 (తెలుగుగళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం అమ్మపాలెం గ్రామంలో సోమవారం ఆత్మ ఆధ్వర్యంలో సెర్ప్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫణిశ్రీ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల మానవ ఆరోగ్యంతో పాటు భూమి భౌతిక స్థితి దెబ్బతింటుందని, భవిష్యత్ తరాలకు అనేక సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతిలో లభించే పదార్థాలతో వ్యవసాయం చేస్తే పెట్టుబడి వ్యయం తగ్గి లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశవాళీ ఆవుల పేడ, మూత్రంతో ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసి పంటలకు వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో మొదటి రెండు సంవత్సరాలు దిగుబడులు కొంత తగ్గినా, మూడో సంవత్సరం నుంచి గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. జీవ సంబంధ ఎరువులు, పురుగుమందులను వినియోగిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి. శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి పచ్చల రామమోహన్, ఏపీఎం సుబ్బారావు, సర్పంచ్ పెద్దగొండ్ల ప్రసన్న, సీఆర్పీలు పెద్దగొండ్ల ధర్మారావు, పుచ్చ రమేష్, సాధు చిన్నారి, నందిగాం లక్ష్మి, దేవయ్య, సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఐకేపీ మహిళలు, సమన్వయకర్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు రీమా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే తో భేటీ అయిన జిల్లా వాణిజ్య సెల్ చైర్మన్ గ్రంధి”





సత్తుపల్లి,ఆర్ సి,నవంబర్09(తెలుగు గళం) న్యూస్: సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో సోమవారం ఇటీవల నియమితులైన కాంగ్రెస్ జిల్లా వాణిజ్య సెల్ వైర్మన్ గ్రంధి ప్రవీణ్ కుమార్ భేటీ అయ్యారు.ఈ సందర్భంగా గౌరవ మర్యాదతో మట్టా దంపతులకు పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాలు కప్పి గ్రంధి ఘనంగా సత్కరించారు.

అనంతరం నియోజకవర్గ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధి,వ్యాపార వర్గాల సంక్షేమం కోసం నిస్వార్ధంగా సేవ చేస్తానని మట్టా దంపతుల సహకారం అందించాలని ప్రవీణ్ వినమ్రంగా కోరారు.ప్రవీణ్ కుమార్ ను మట్టా దయానంద్ శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో: జిల్లా కాంగ్రెస్ నాయకులు తాటికొండ రాము,వైరా మండల ఆర్యవైశ్యుల సంఘం నాయకులు మైలవరపు శ్రీనివాసరావు, రామినీ ప్రశాంత్ లు పాల్గొన్నారు.

సమాజ మార్పు కోసం యువత శ్రమించాలి

: వస్కుల ప్రవీణ్



హనుమకొండ (తెలుగు గళం) నవంబర్ 9:

బీఎస్పీ వరంగల్ జిల్లా ఇంచార్జీ, మడికొండ 46వ డివిజన్ నుంచి రాబోయే జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థిగా బరిలో నిలవనున్న వస్కుల ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు సమాజ మార్పు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకొని,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి యువకుడు సైనికుడిలా ముందుకు సాగాలని అన్నారు.పట్టుదలతో లక్ష్యాలను సాధిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవడమే నిజమైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఆదివాసీలకే కేటాయించాలి!

- ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఆదివాసీ నాయకత్వమే సరైన మార్గం
- ఆదివాసీ విద్యార్థి సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దబ్బగట్ల శ్రీకాంత్ డిమాండ్

తెలుగు గళం ములుగు జిల్లా, నవంబర్ 09:



ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఏర్పాటైన ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం గుర్తింపు పొందిన షెడ్యూల్డ్ తెగల ఆదివాసీ వ్యక్తికే కేటాయించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు దబ్బగట్ల శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న భూమి సమస్యలు, అటవీ హక్కులు, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి సమస్యలపై క్షేత్రస్థాయి అవగాహన ఉన్న ఆదివాసీ నాయకుడే ఎస్టీ కమిషన్‌కు నాయకత్వం వహించాలని స్పష్టం చేశారు. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, హక్కుల గురించి సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తికి ఈ అత్యున్నత బాధ్యతలు అప్పగించడం ద్వారా మాత్రమే గిరిజన సమాజానికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తూ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో ఆదివాసీ సమాజానికి చెందిన ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులు, అనుభవజ్ఞులైన నాయకులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్టీ కమిషన్ అనేది కేవలం ఒక పదవి లేదా అధికార వ్యవస్థ మాత్రమే కాదని, కోట్లాది ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వానికి సంబంధించిన కీలకమైన రాజ్యాంగ సంస్థ అని పేర్కొన్నారు. అందుకే ఎస్టీ కమిషన్‌లో ఆదివాసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు చైర్మన్ పదవిని కూడా ఆదివాసీ వ్యక్తికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ సమాజం ఆకాంక్షలను గౌరవించి, ఈ న్యాయమైన డిమాండ్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలని దబ్బగట్ల శ్రీకాంత్ కోరారు.

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ ఎఫ్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

ఎమ్మెస్ ఎఫ్ ను సంస్థాగతంగా బలోపేతం చేసుకుందాం.

విద్యార్థుల ద్వారానే ఉద్యమాలు విజయవంతం

ఎంఎస్ఎఫ్ 15వ తేదీన మరిపెడ మండల సదస్సు విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇంచార్జీ శాగంటి రమేష్ మాదిగ

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

రాంపూర్ నూతన గ్రామ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ ఎఫ్,కమిటీ ఎన్నిక.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు : బందు.వీరన్న 9704577716.

ఉపాధ్యక్షులు. పాల్వాయి.యాకయ్య.7989586449.

అధికార ప్రతినిధి:చింత వీరన్న 9100895883.

ఎమ్మెస్ ఎఫ్ నూతన కమిటీ.

గ్రామ అధ్యక్షులు: బందు కృష్ణ 8501809461.

ఉపాధ్యక్షులు. పాల్వాయి. రామయ్య.7569752196.

అధికార ప్రతినిధి: పాల్వాయి. ఎల్లయ్య 9618471896.

ఎస్సీ వర్గీకరణను సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించుకున్న తరువాత కుల, మత,వర్గ లింగ వివక్షత లేని సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని





సమాజహితం,సామాజిక న్యాయం, సమానత్వం కోసం గ్రామ కమిటీకి ఎమ్మార్పీఎస్,మండల అధ్యక్షులు మంద వెంకన్న మాదిగ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇంచార్జీ శాగంటి రమేష్ మాదిగ, మాట్లాడుతూ “ ప్రపంచంలో ఏ ఉద్యమం విజయం సాధించినా దాని వెనుక విద్యార్థి శక్తి దాగి ఉందని అన్నారు.అలాగే ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయం సాధించడానికి మాదిగ విద్యార్థులు కూడా వీరోచితంగా పాత్రను పోషించారని తెలిపారు, కుల మత లింగ వివక్షత ప్రజల్ని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు.అందువల్ల దేశంలో సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వం రావాల్సిన అవసరం ఉందని అన్నారు.అలాగే అన్ని రకాల వివక్షతలు తొలగిపోవాలని అన్నారు.అందుకోసం మహనీయుల బాటలో భవిష్యత్తు ఉద్యమానికి పద్మ మంద కృష్ణ మాదిగ శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ పోరాటం శక్తివంతంగా ముందుకు సాగాలంటే విద్యార్థులు ఉద్యమంలో భాగస్వాములు కావాలని అన్నారు.అందుకోసం విద్యార్థుల్లో చైతన్యం పెంపొందిస్తూ అలాగే ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ ఎఫ్,కమిటీలు వేయాలని అన్నారు. నూతన ఎమ్మెస్ ఎఫ్ కమిటీలు ఏర్పాటు చేసి వారిని భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు బందు వెంకన్న,బందు పరశురాములు,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పాల్వాయి ఇద్దయ్య, ఎల్లయ్య, పరశురాములు, రామన్న, మహేష్, రామయ్యా, ముత్తయ్య, చింత వెంకన్న, ఉప్పలయ్య, వీరయ్య, నర్సయ్యా, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో ఎమ్మెస్ఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక

మాదిగ విద్యార్థులు విద్య, విజ్ఞానం, వికాసంలో ముందుండాలి : ఏపూరి వెంకటేశ్వరరావు


ధర్మసాగర్, నవంబర్ 9 (తెలుగు గళం):



మాదిగ విద్యార్థులు విద్య, విజ్ఞానం, వివేకం, వికాసంలో ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు.ధర్మసాగర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సింగారపు పవన్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెస్ఎఫ్ మండల సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభిస్తున్న రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని, మాదిగ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఎమ్మెస్ఎఫ్‌లో భాగస్వాములు కావాలని కోరారు.అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా కొయ్యడ గౌతం మాదిగ, అధికార ప్రతినిధిగా కొలిపాక సర్జన్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కనకం అక్షిత మాదిగ, ఉపాధ్యక్షులుగా కుర్సపల్లి ఆదిత్య, కందుకూరి సందేశ్ వర్మ, పసునూరి వికాస్, కార్యదర్శిగా వాస్కుల రోహిత్ మాదిగ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో తడుగుల విజయ్ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, బొడ్డు శాంతిసాగర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘనపూర్ ప్రజావాణిలో మూడు దరఖాస్తులు స్వీకరణ

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 09(తెలుగు గళం)



స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి మూడు దరఖాస్తులను స్వీకరించారు.రెవెన్యూ డివిజనల్ అధికారి యస్. కిరణ్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా బాడిశ నాగరమేష్..

-బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల పరామర్శ.. రూ.25 వేల ఆర్థిక సాయం
- మానవత్వం చాటుకున్న బాడిశ నాగరమేష్.. ఐదు కుటుంబాలకు ఆర్థిక చేయూత
- మృతుల కుటుంబాలకు భరోసా.. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల సాయం
- కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్..



తెలుగు గళం మంగపేట, నవంబర్ 9:

మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రొడ్యూర్, మల్కపల్లి, గంపోనిగూడెం, పూరేడుపల్లి, మోట్లగూడెం, నిమ్మగూడెం, చింతకుంట గ్రామాల్లో బాధిత కుటుంబాలను కలిసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం ఐదు బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా నాగరమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, ఖుర్బాన్ అలీ, నూనె లింగయ్య, పూజారి శ్రీనివాస్ తదితర నాయకులు, వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు, యువజన నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

15 ఏళ్ల రహదారి కష్టాలకు తెర.. చింతలపాడు గూడేనికి గ్రావెల్ రోడ్డు!

- మంత్రి సీతక్క చొరవతో చింతలపాడుకు రోడ్డు.. సీఎం జన్మదినం సందర్భంగా ప్రారంభం!
- గిరిజన గూడెంలో అభివృద్ధి అడుగులు.. సీతక్కకు గ్రామస్థుల కృతజ్ఞతలు!





తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 8:

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చింతలపాడు గొత్తి కోయ గిరిజన గ్రామ ప్రజలు గత 15 సంవత్సరాలుగా సరైన రహదారి సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో గ్రామానికి గ్రావెల్ రోడ్డు మంజూరైంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్ సమక్షంలో నూతనంగా మంజూరైన గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్థులకు ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల రాకపోకలు, నిత్యావసరాల రవాణాకు మార్గం సుగమం కానుంది. 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ గ్రామ రహదారి కల నెరవేరే దిశగా అడుగులు పడటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన గ్రామాల సమస్యలను గుర్తించి రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన మంత్రి సీతక్కకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కంచ ఐలయ్య విమర్శలు సరికాదు.. వేం నరేందర్ రెడ్డి సేవలను విస్మరించలేం: రాయపురం సాంబయ్య

20 ఏళ్ల స్నేహబంధం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర.. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

వరంగల్ నవంబర్ 9(తెలుగు గళం)



వేం నరేందర్ రెడ్డిపై కంచ ఐలయ్య చేసిన విమర్శలపై వరంగల్ కాంగ్రెస్ సీనియర్ నేత రాయపురం సాంబయ్య స్పందించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి మధ్య గత 20 ఏళ్లుగా స్నేహబంధం కొనసాగుతోందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన చేసిన రాజకీయ కృషిని విస్మరించి విమర్శలు చేయడం సరికాదని అన్నారు.ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా ఇతరులపై విమర్శలు చేయడం తగదని రాయపురం సాంబయ్య అభిప్రాయపడ్డారు.రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని సూచించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనతో పాటు సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని వర్గాల వారికి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. పార్టీలో ప్రత్యక్షంగా పనిచేయని వారికి సైతం సామాజిక నేపథ్యం, అర్హతలు, సేవలను గుర్తించి సముచిత గుర్తింపు కల్పిస్తోందన్నారు.గద్దర్, చాకలి ఐలమ్మ వారసత్వం, శ్రీకాంత్ ఆచారి తల్లి, ఆకునూరి మురళి వంటి సామాజిక నేపథ్యం కలిగిన వారికి గుర్తింపు, అవకాశాలు కల్పించడం సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలను గౌరవిస్తూనే సమాజంలోని అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ కాంగ్రెస్ సీనియర్ నేత రాయపురం సాంబయ్య స్పష్టం చేశారు.

కమ్యూనిస్టులకు పునరేకీకరణ తప్ప మరో మార్గం లేదు!

చీలికలతో బలహీనపడుతున్న కమ్యూనిస్టు ఉద్యమానికి ఐక్యతే ప్రత్యామ్నాయం

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఒక కీలకమైన చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. ప్రజల సమస్యలపై పోరాడే చరిత్ర, త్యాగాల సంపద, శాస్త్రీయమైన మార్క్సిస్టు సిద్ధాంతం ఉన్నప్పటికీ, రాజకీయంగా మాత్రం కమ్యూనిస్టు పార్టీలు రోజురోజుకూ బలహీనపడుతున్నాయి. ఒకవైపు పాలకవర్గాలు బలపడుతుంటే, మరోవైపు ప్రజలకు ప్రత్యామ్నాయంగా నిలవాల్సిన కమ్యూనిస్టు శక్తులు చీలికలతో తమ బలాన్ని తామే తగ్గించుకుంటున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి కమ్యూనిస్టుల పునరేకీకరణ తప్ప మరో మార్గం లేదు.

ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే ఐక్యత తప్పనిసరి!

భారతదేశంలో ఉన్న ప్రతి కమ్యూనిస్టు పార్టీ తమ పార్టీ నాయకత్వంలోనే దేశంలో విప్లవం సాధ్యమవుతుందని చెబుతోంది. ఆయా పార్టీల కార్యకర్తలు, సభ్యులు, అభిమానులు తమ పార్టీపై విశ్వాసంతో ఆ వాదనలను నమ్మడం సహజమే. కానీ దేశంలోని కోట్లాది ప్రజలు, ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని అభిమానించే సాధారణ ప్రజలు కూడా అదే విశ్వాసంతో ఉన్నారా? అన్నది ఆలోచించాల్సిన ప్రశ్న.

ఒకప్పుడు భారతదేశంలో సీపీఐ(ఎం), మావోయిస్టు పార్టీ వంటి శక్తుల పట్ల కమ్యూనిస్టు అభిమానుల్లోనే కాకుండా, సాధారణ ప్రజల్లో కూడా ఎన్నో ఆశలు ఉండేవి. సీపీఎం పార్లమెంటరీ రాజకీయాల ద్వారా బలమైన ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తుందని, మావోయిస్టు ఉద్యమం సాయుధ పోరాట మార్గంలో విప్లవాన్ని ముందుకు తీసుకెళ్తుందని భిన్నమైన అంచనాలు ఉండేవి.

2026 నాటికి చోటుచేసుకున్న రాజకీయ, ఉద్యమ పరిణామాలు ఈ అంచనాలను తీవ్రంగా ప్రశ్నిస్తున్నాయి. సీపీఎం తనకు ఒకప్పుడు బలమైన రాజకీయ స్థావరాలుగా ఉన్న పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలను ఇప్పటికే కోల్పోయింది. 2026 కేరళ ఎన్నికల పరిణామంతో అక్కడి ప్రభుత్వాన్ని కూడా కోల్పోయింది. మరోవైపు కగార్ ఆపరేషన్ నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే, భారతదేశంలో ఏదో ఒక కమ్యూనిస్టు పార్టీ తనంతట తానుగా ఎదిగి దేశానికి ప్రత్యామ్నాయంగా నిలుస్తుందనే పాత అంచనాలను పునఃపరిశీలించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే మార్క్సిజాన్ని విశ్వసించే కమ్యూనిస్టులందరూ ఒకే వేదికపైకి రావాలి. ఒక బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం జరగాలి. అప్పుడే ఇతర వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక న్యాయ శక్తులను ఐక్యపరిచి దేశానికి నిజమైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం సాధ్యమవుతుంది.

కమ్యూనిస్టు పార్టీల బలహీనతకు కారణం ఏమిటి?

భారతదేశంలో ప్రధాన కమ్యూనిస్టు పార్టీలు ఐదారు ఉండగా, వాటికి అదనంగా అనేక చిన్న చిన్న పార్టీలు, గ్రూపులు ఉన్నాయి. పేర్లు వేర్వేరుగా ఉన్నప్పటికీ, మార్క్సిజం, సామాజిక సమానత్వం, దోపిడీ నిర్మూలన, కార్మికవర్గ విముక్తి వంటి మౌలిక లక్ష్యాలను ప్రకటిస్తున్నాయి.

అయితే వాస్తవ పరిస్థితి ఏమిటి? దాదాపు అన్ని కమ్యూనిస్టు పార్టీలు రోజురోజుకూ బలహీనపడుతున్నాయి. ఈ వాస్తవాన్ని ఆయా పార్టీల నాయకత్వాలు కూడా పూర్తిగా కాదనలేని పరిస్థితి ఉంది.

అయితే ఈ బలహీనత ఎందుకు వచ్చింది? దశాబ్దాలుగా పోరాటాలు చేసిన కమ్యూనిస్టు ఉద్యమం ప్రజల్లో తన ప్రభావాన్ని ఎందుకు కోల్పోతోంది? యువతను, కార్మికులను, రైతులను, మహిళలను, సామాజికంగా అణగారిన వర్గాలను పెద్ద సంఖ్యలో ఎందుకు ఆకర్షించలేకపోతోంది?

ఈ ప్రశ్నలకు ప్రతి పార్టీ తనలో తాను నిజాయితీగా సమాధానం వెతుక్కోవాలి.

కానీ దురదృష్టవశాత్తూ, చాలా పార్టీలు తమ బలహీనతను తాత్కాలిక వెనుకంజగా మాత్రమే భావిస్తున్నాయి. త్వరలోనే ప్రజలు తమవైపు వస్తారని, తమ పార్టీ మళ్లీ బలపడుతుందని, దేశంలో ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగి విప్లవాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఇందుకు వారు చూపిస్తున్న ప్రధాన కారణం పాలకవర్గాల వైఫల్యం.

పాలక పార్టీలు కొద్దిమంది పెట్టుబడిదారులు, సంపన్న వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని, ప్రజల సమస్యలను పరిష్కరించలేవని, అందువల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని కమ్యూనిస్టులు విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణలో వాస్తవం ఉంది. కానీ ఇక్కడే ఒక కీలకమైన ప్రశ్న ఎదురవుతోంది.

ప్రజల్లో పాలకులపై అసంతృప్తి పెరిగినంత మాత్రాన ఆ ప్రజలందరూ కమ్యూనిస్టు పార్టీలవైపే ఎందుకు వస్తారు?

ప్రజలు బూర్జువా ప్రతిపక్ష పార్టీలను వదిలి కమ్యూనిస్టులవైపు రావడానికి కారణం ఏమిటి? ఒక కమ్యూనిస్టు పార్టీని వదిలి మరో కమ్యూనిస్టు పార్టీని ఎందుకు ఎంచుకుంటారు? అనేక కమ్యూనిస్టు పార్టీల మధ్య తమ పార్టీనే ఎందుకు ఎంచుకోవాలి?

ఈ ప్రశ్నలకు ప్రతి పార్టీ శాస్త్రీయమైన, వాస్తవికమైన సమాధానం చెప్పాల్సి ఉంది.

ప్రజల్లో అసంతృప్తి పెరగడం ఒక రాజకీయ అవకాశం మాత్రమే. ఆ అసంతృప్తిని ప్రజా ఉద్యమంగా మార్చడం, ప్రజలకు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాన్ని చూపించడం, ఆ ప్రత్యామ్నాయానికి నాయకత్వం వహించడం ఒక బలమైన రాజకీయ శక్తికి మాత్రమే సాధ్యమవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా పాలకులపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నది. లాటిన్ అమెరికా దేశాల్లోనూ, ఐరోపాలోనూ, మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్‌లలోనూ అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలక పార్టీలు ఓడిపోతున్నాయి. ప్రజలు తమ అసంతృప్తిని వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్నారు.

కానీ ఆ అసంతృప్తి అంతా కమ్యూనిస్టు పార్టీలకు అనుకూలంగా మారడం లేదు. పాలకులు ఓడిపోయినంత మాత్రాన కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం లేదు.

అంటే ప్రజల్లో అసంతృప్తి ఉండటం ఒకటైతే, ఆ అసంతృప్తిని కమ్యూనిస్టు ఉద్యమం తనకు అనుకూలంగా మలుచుకోవడం మరొకటి. ఈ రెండింటి మధ్య ఉన్న రాజకీయ అంతరాన్ని కమ్యూనిస్టు పార్టీలు గుర్తించాలి.

సీపీఎం, మావోయిస్టు ఉద్యమాల పరిణామాలు ఏమి చెబుతున్నాయి?

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి భవిష్యత్తు ఉందనే ఆశలను ఒకప్పుడు ప్రధానంగా రెండు భిన్నమైన రాజకీయ మార్గాలపై పెట్టుకున్నారు.

ఒకటి: పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు, ప్రజా ఉద్యమాలు, ప్రజాసంఘాల ద్వారా అధికారంలోకి రావాలని ప్రయత్నించిన సీపీఎం మార్గం.

రెండవది: సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న మావోయిస్టు మార్గం.

ఈ రెండు మార్గాల పట్ల కూడా దేశంలో అనేకమంది కమ్యూనిస్టు అభిమానులకు, ప్రజలకు ఆశలు ఉండేవి.

సీపీఎం ఒకప్పుడు పశ్చిమ బెంగాల్, త్రిపుర, కేరళ రాష్ట్రాల్లో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో దశాబ్దాలపాటు అధికారంలో కొనసాగింది. త్రిపురలోనూ బలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కేరళలోనూ అధికారంలోకి వస్తూ, పోతూ తన రాజకీయ ప్రాబల్యాన్ని కొనసాగించింది.

అయితే క్రమంగా పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో తన అధికారాన్ని కోల్పోయింది. 2026లో కేరళలోనూ అధికారాన్ని కోల్పోవడంతో సీపీఎం రాజకీయ ప్రస్థానం గురించి తీవ్రమైన సమీక్ష అవసరమైంది.

ఇది కేవలం ఒక ఎన్నికల్లో ఓటమి కాదు. కమ్యూనిస్టు ఉద్యమం తన రాజకీయ బలాన్ని, ప్రజలతో ఉన్న సంబంధాలను, మారుతున్న సామాజిక పరిస్థితులను ఎంతవరకు అర్థం చేసుకుంటుందనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది.

అదేవిధంగా మావోయిస్టు ఉద్యమం గురించి కూడా ఒకప్పుడు దేశవ్యాప్తంగా విస్తృతమైన ప్రచారం ఉండేది. ముఖ్యంగా దండకారణ్యంలో మావోయిస్టులు బలమైన స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారని, జనతన ప్రభుత్వాల ద్వారా ప్రత్యామ్నాయ పాలనా వ్యవస్థను నిర్మించారని, వందలాది దళాలు, వేలాది మంది గెరిల్లాలతో సాయుధ పోరాటం కొనసాగిస్తున్నారని ప్రచారం జరిగేది.

ఆ ఉద్యమం దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించగలదనే అంచనాలు ఉండేవి.

కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కగార్ ఆపరేషన్ తదితర నిర్బంధ చర్యల నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాని నిర్మాణం, నాయకత్వం, భవిష్యత్తు గురించి అనేక ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

ఇక్కడ మనం ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఈ రెండు రాజకీయ మార్గాల అనుభవాలను విమర్శనాత్మకంగా సమీక్షించడం అంటే ఆయా పార్టీల కార్యకర్తల త్యాగాలను తక్కువ చేయడం కాదు. వారి పోరాట చరిత్రను కించపరచడం అంతకంటే కాదు.

కానీ చరిత్రను గౌరవించడం అంటే గత విజయాలనే పదేపదే చెప్పుకోవడం కాదు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని భవిష్యత్తుకు సరైన రాజకీయ మార్గాన్ని రూపొందించుకోవడం.

ఒకప్పుడు ఉన్న బలాన్ని గుర్తుచేసుకుంటూ భవిష్యత్తును నిర్మించలేం. మారిన పరిస్థితులను అర్థం చేసుకొని కొత్త రాజకీయ నిర్మాణాన్ని చేపట్టాలి.

కమ్యూనిస్టుల పట్ల ప్రజలకు అభిమానం ఉంది.. కానీ విశ్వాసం తగ్గుతోంది!

నేటికీ భారతదేశంలో కమ్యూనిస్టుల పట్ల ప్రజలకు గౌరవం ఉంది. కమ్యూనిస్టుల త్యాగాలు, నిస్వార్థ జీవితాలు, నిరాడంబరత, ప్రజా సమస్యలపై పోరాడే స్వభావాన్ని అనేకమంది ప్రజలు ప్రశంసిస్తుంటారు.

కార్మికుల హక్కుల కోసం, రైతుల సమస్యల కోసం, భూమిలేని పేదల కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం కమ్యూనిస్టులు చేసిన పోరాటాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.

కానీ ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది.

కమ్యూనిస్టులు మంచివారే, వారి సిద్ధాంతం మంచిదే, వారి త్యాగాలు గొప్పవే. కానీ వారు అనేక పార్టీలుగా విడిపోయారు కాబట్టి దేశంలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగలేరనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది.

ఇది కమ్యూనిస్టు ఉద్యమానికి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి.

ప్రజలు కమ్యూనిస్టులను అభిమానించడం ఒకటైతే, వారి నాయకత్వంలో భవిష్యత్తుపై విశ్వాసం ఉంచడం మరొకటి. అభిమానాన్ని రాజకీయ విశ్వాసంగా మార్చలేకపోతే ఉద్యమం విస్తరించదు.

ఈ సమస్య కేవలం సాధారణ ప్రజల్లోనే లేదు. కమ్యూనిస్టు పార్టీల సానుభూతిపరులు, సభ్యులు, కార్యకర్తలు, నాయకత్వంలోని అనేకమంది కూడా ఈ పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు.

ముఖ్యంగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అభిమానించే ప్రజల్లో గణనీయమైన భాగం ఏ ఒక్క పార్టీకి పరిమితం కాకుండా పార్టీల వెలుపలే ఉంది. వారిలో చాలామంది కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నారు.

వారి ప్రశ్న ఒక్కటే:

మార్క్సిజాన్ని విశ్వసించే కమ్యూనిస్టులందరికీ లక్ష్యం ఒక్కటైనప్పుడు, ఎందుకు ఇన్ని పార్టీలు? ఎందుకు ఇన్ని చీలికలు? ఎందుకు ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు?

ఈ ప్రశ్నలకు కమ్యూనిస్టు నాయకత్వాలు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

ఐక్యత వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?

కమ్యూనిస్టుల పునరేకీకరణ జరిగితే అది కేవలం పార్టీల సంఖ్య తగ్గడం మాత్రమే కాదు. దేశ రాజకీయాల్లో ఒక కొత్త శక్తి ఆవిర్భవించే అవకాశం ఏర్పడుతుంది.

మొదటిది: ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

చీలికలతో ఉన్న కమ్యూనిస్టులందరూ ఒకే రాజకీయ శక్తిగా ముందుకు వస్తే, ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తాయి. కమ్యూనిస్టులు తమ వ్యక్తిగత, సంస్థాగత ప్రయోజనాల కంటే ఉద్యమ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విశ్వాసం ఏర్పడుతుంది.

రెండవది: ఓట్ల చీలిక తగ్గుతుంది.

ఎన్నికల్లో కమ్యూనిస్టులకు అనుకూలంగా ఉన్న ఓట్లు అనేక పార్టీల మధ్య చీలిపోతున్నాయి. ఒకే రాజకీయ శక్తిగా ఎన్నికల బరిలోకి దిగితే ఓట్ల ఏకీకరణ సాధ్యమవుతుంది. కమ్యూనిస్టులకు ఓటు వేస్తే గెలవలేరనే భావన కూడా క్రమంగా తొలగవచ్చు.

మూడవది: ప్రజా ఉద్యమాలకు బలం పెరుగుతుంది.

ప్రస్తుతం వివిధ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు పనిచేస్తున్నాయి. అనేక సందర్భాల్లో ఒకే సమస్యపై వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

పునరేకీకరణ జరిగితే ఈ ప్రజా సంఘాల మధ్య సమన్వయం, సహకారం పెరుగుతుంది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది.

నాలుగవది: సామాజిక న్యాయ శక్తులు దగ్గరవుతాయి.

భారతదేశంలో వర్గ దోపిడీతో పాటు కుల వివక్ష, సామాజిక అణచివేత, భూస్వామ్య ఆధిపత్యం, పితృస్వామిక వ్యవస్థ వంటి అనేక సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలపై పోరాడే బహుజన, సామాజిక న్యాయ, ప్రజాతంత్ర శక్తులను కమ్యూనిస్టు ఉద్యమం దగ్గరకు తీసుకురావాలి.

ఒక బలమైన, ఐక్యమైన కమ్యూనిస్టు పార్టీ ఉంటేనే ఈ శక్తులను సమన్వయం చేయడం మరింత సులభమవుతుంది.

ఐదవది: దేశానికి ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పడుతుంది.

ప్రస్తుతం దేశంలో పాలకవర్గ రాజకీయాలకు నిజమైన ప్రజా ప్రత్యామ్నాయం అవసరం. కార్మికులు, రైతులు, పేదలు, మహిళలు, యువత, సామాజికంగా అణగారిన వర్గాల ప్రయోజనాలను ప్రతిబింబించే రాజకీయ శక్తి అవసరం.

కమ్యూనిస్టుల పునరేకీకరణ ఆ ప్రత్యామ్నాయ నిర్మాణానికి పునాది కాగలదు.

కమ్యూనిస్టుల ఐక్యతకు అడ్డంకులు ఏమిటి?

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతుంది. కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని అందరూ అంగీకరిస్తున్నప్పుడు అది ఎందుకు సాధ్యం కావడం లేదు?

దీనికి సిద్ధాంతపరమైన విభేదాలు ఒక కారణమని చెబుతారు. వర్గపోరాటం, విప్లవ మార్గం, పార్లమెంటరీ రాజకీయాలు, సాయుధ పోరాటం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ పరిణామాలు వంటి అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

ఈ విభేదాలన్నింటినీ అధిగమించలేనివిగా భావించడం సరైనదేనా?

మార్క్సిజం అనేది సమాజాన్ని శాస్త్రీయంగా విశ్లేషించే సిద్ధాంతం. అది నిరంతర అధ్యయనం, చర్చ, అనుభవాల సమీక్ష ద్వారా అభివృద్ధి చెందుతుంది. భిన్నాభిప్రాయాలు ఉండటం తప్పు కాదు. వాటిని పరిష్కరించడానికి ప్రజాస్వామ్యబద్ధమైన వ్యవస్థ లేకపోవడమే అసలు సమస్య.

అదే సమయంలో పార్టీ నాయకత్వాల్లో పెరిగిన అహంభావాలు, సంస్థాగత ఆధిపత్య ధోరణులు, వ్యక్తిగత ప్రతిష్ఠలు, గత విభేదాలను పట్టుకొని ఉండే మనస్తత్వం కూడా ఐక్యతకు అడ్డంకులుగా మారుతున్నాయి.

ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే నాయకత్వం సామీప్యతలను వెతుకుతుంది. వ్యక్తిగత, సంస్థాగత ఆధిపత్యాలకు ప్రాధాన్యత ఇచ్చే నాయకత్వం మాత్రం విభేదాలను పెద్దవిగా చూపిస్తుంది.

ఇక్కడ నాయకత్వాలు ఒక విషయం ఆలోచించాలి.

పార్టీ పేరు గొప్పదా? లేక పార్టీ లక్ష్యం గొప్పదా?

పార్టీ జెండా ముఖ్యమా? లేక ఆ జెండా ప్రతిబింబించే సిద్ధాంతం, ప్రజల విముక్తి లక్ష్యం ముఖ్యమా?

ఒక నాయకుడి ప్రతిష్ఠ ముఖ్యమా? లేక కోట్లాది ప్రజల భవిష్యత్తు ముఖ్యమా?

ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పుకున్నప్పుడు ఐక్యతకు ఉన్న అడ్డంకుల్లో అనేకం తొలగిపోతాయి.

గతంలో ఉన్న రెండు అవకాశాలు.. ఇప్పుడు మిగిలింది ఒక్కటే!

గతంలో భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ప్రధానంగా రెండు అవకాశాలు ఉన్నాయని భావించేవారు.

మొదటిది, అప్పటికే ఉన్న కమ్యూనిస్టు పార్టీల్లో ఏదో ఒక పార్టీ తన రాజకీయ, ప్రజా ఉద్యమ బలంతో ముందుకు వచ్చి మిగతా కమ్యూనిస్టు శక్తులను ఆకర్షించి దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించడం.

రెండవది, మార్క్సిజాన్ని విశ్వసించే కమ్యూనిస్టులందరూ తమ మధ్య ఉన్న విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకొని ఒకే పార్టీగా పునరేకీకరణ కావడం.

మొదటి అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుంటే, సీపీఎం లేదా మావోయిస్టు పార్టీ దేశంలోని ఇతర కమ్యూనిస్టు పార్టీలను వెనక్కి నెట్టి, వాటన్నింటికీ నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతాయనే అంచనాలు ఇప్పుడు తీవ్రమైన ప్రశ్నలను ఎదుర్కొంటున్నాయి.

దీంతో రెండవ మార్గం, అంటే కమ్యూనిస్టుల పునరేకీకరణ ద్వారానే బలమైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం మరింత పెరిగింది.

ఇది ఏ ఒక్క పార్టీకి వ్యతిరేకమైన ప్రతిపాదన కాదు. ఏ ఒక్క పార్టీ ఆధిపత్యాన్ని స్థాపించాలనే ప్రయత్నమూ కాదు. ఇది మొత్తం కమ్యూనిస్టు ఉద్యమ భవిష్యత్తుకు సంబంధించిన ప్రతిపాదన.

పునరేకీకరణ అంటే విభేదాలను పక్కనపెట్టి రాజీ పడటమా?

కమ్యూనిస్టుల పునరేకీకరణ అంటే అందరూ తమ అభిప్రాయాలను వదులుకొని ఒకే నాయకుడి కింద చేరిపోవడం కాదు. అలాగే సిద్ధాంతపరమైన చర్చలను నిలిపివేయడం కూడా కాదు.

పునరేకీకరణకు ఒక స్పష్టమైన ప్రజాస్వామ్యబద్ధమైన ప్రక్రియ ఉండాలి.

మార్క్సిజం ప్రాథమిక సిద్ధాంతాలపై ఉమ్మడి అవగాహన ఏర్పరచుకోవాలి. భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను సమిష్టిగా అధ్యయనం చేయాలి. గత ఉద్యమ అనుభవాలపై నిజాయితీగా సమీక్ష జరపాలి. భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతమైన చర్చలు నిర్వహించాలి.

భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉండాలి. చర్చల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలి. నిర్ణయాలు తీసుకున్న తర్వాత ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రం ప్రకారం సమిష్టిగా వాటిని అమలు చేయాలి.

నాయకత్వం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరికీ బాధ్యత, జవాబుదారీతనం ఉండాలి.

ఇలాంటి పునాదుల మీద నిర్మితమయ్యే ఐక్యత మాత్రమే దీర్ఘకాలం నిలబడగలదు.

అందువల్ల కమ్యూనిస్టు పునరేకీకరణ అనేది కేవలం సంస్థాగత విలీనం కాదు. అది సిద్ధాంతపరమైన సమీక్ష, రాజకీయ పునర్నిర్మాణం, ప్రజా ఉద్యమాల సమన్వయం, నాయకత్వ సంస్కరణలతో కూడిన చారిత్రక ప్రక్రియ కావాలి.

ఇప్పటికైనా నాయకత్వాలు ఆలోచించాలి!

ఇప్పటికే కమ్యూనిస్టు ఉద్యమం అనేక దశాబ్దాల కాలాన్ని కోల్పోయింది. చీలికల కారణంగా బలహీనపడిన ఉద్యమం మరింత బలహీనపడితే భవిష్యత్తులో కొన్ని పార్టీలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. మరికొన్ని పార్టీలు పేరుకే కొనసాగుతూ నామమాత్రపు సంస్థలుగా మిగిలిపోయే పరిస్థితి రావచ్చు.

అది ఆయా పార్టీలకే కాదు, దేశంలోని ప్రజాతంత్ర ఉద్యమానికి కూడా తీరని నష్టం.

ఎందుకంటే కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడితే కార్మికవర్గ పోరాటాలకు, రైతాంగ ఉద్యమాలకు, సామాజిక సమానత్వ పోరాటాలకు, మతతత్వ వ్యతిరేక పోరాటాలకు ఒక బలమైన రాజకీయ కేంద్రం బలహీనపడుతుంది.

ప్రజలకు అవసరమైనది మరిన్ని కమ్యూనిస్టు పార్టీలు కాదు. ప్రజల సమస్యలపై సమిష్టిగా పోరాడే, దేశ రాజకీయాలకు దిశానిర్దేశం చేయగలిగే బలమైన కమ్యూనిస్టు ఉద్యమం.

అందుకోసం ప్రతి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం తమ సంస్థాగత ప్రయోజనాల కంటే ఉద్యమ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యక్తిగత అహంభావాలు, ఆధిపత్య ధోరణులు, పాత విభేదాలను పక్కనపెట్టి పునరేకీకరణ దిశగా చొరవ తీసుకోవాలి.

చర్చలకు సిద్ధపడాలి. ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలి. అన్ని కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో విస్తృతమైన చర్చా వేదికలను ఏర్పాటు చేయాలి.

పునరేకీకరణ ప్రక్రియను నాయకత్వాల మధ్య జరిగే చర్చలకే పరిమితం చేయకుండా, కింది స్థాయి పార్టీ సభ్యులు, కార్యకర్తలు, కమ్యూనిస్టు అభిమానులు, ప్రజాస్వామిక శక్తుల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లాలి.

ఎందుకంటే కమ్యూనిస్టు ఉద్యమం ఏ ఒక్క నాయకుడిదో, ఏ ఒక్క పార్టీదో కాదు. అది శ్రమజీవుల విముక్తి కోసం ఏర్పడిన చారిత్రక ఉద్యమం.

కమ్యూనిస్టులారా.. ఇప్పటికైనా ఆలోచించండి!

నేడు భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సంక్షోభం కేవలం ఎన్నికల్లో ఓడిపోవడం వల్ల వచ్చినది కాదు. అది రాజకీయంగా, సంస్థాగతంగా, ప్రజలతో సంబంధాల పరంగా ఏర్పడిన బలహీనతల సమాహారం.

ఈ పరిస్థితిని మార్చాలంటే గత వైఫల్యాలను నిజాయితీగా సమీక్షించుకోవాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాన్ని పునర్నిర్మించుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా కమ్యూనిస్టుల మధ్య ఐక్యతను సాధించాలి.

ఒక పార్టీ నాయకత్వంలోనే విప్లవం సాధ్యమని ప్రతి పార్టీ భావిస్తే, ఆ లక్ష్యం మరింత దూరమవుతుంది. కానీ మార్క్సిజాన్ని విశ్వసించే శక్తులన్నీ ఒకే రాజకీయ వేదికపైకి వస్తే, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందే అవకాశం ఏర్పడుతుంది.

దేశంలో బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం జరిగితేనే వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక న్యాయ శక్తులన్నింటినీ సమీకరించి పాలకవర్గాలకు ప్రత్యామ్నాయాన్ని నిర్మించగలం.

ఇది కాలం మన ముందుంచిన అవసరం. ఇది ప్రజల ఆకాంక్ష. ఇది కమ్యూనిస్టు ఉద్యమం మనుగడకు సంబంధించిన ప్రశ్న.

ఇప్పుడున్న చీలికలనే కొనసాగిస్తే చరిత్ర మనల్ని క్షమించదు. ఐక్యమైతేనే భవిష్యత్తును నిర్మించగలం.

కాబట్టి కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలకు, కార్యకర్తలకు, అభిమానులకు, మార్క్సిజాన్ని విశ్వసించే మేధావులకు విజ్ఞప్తి.

పార్టీల మధ్య పోటీ కాదు.. పార్టీల మధ్య పునరేకీకరణ కావాలి!

వ్యక్తుల ఆధిపత్యం కాదు.. సమిష్టి నాయకత్వం కావాలి!

చీలికల రాజకీయాలు కాదు.. ఐక్య కమ్యూనిస్టు ఉద్యమం కావాలి!

పాత విభేదాల పునరావృతం కాదు.. భవిష్యత్తు కోసం కొత్త రాజకీయ నిర్మాణం కావాలి!

దేశ ప్రజలకు బలమైన ప్రత్యామ్నాయం అందించాలంటే, మార్క్సిజాన్ని విశ్వసించే కమ్యూనిస్టులందరూ పునరేకీకరణ కావడం తప్ప మరో మార్గం లేదు.

కమ్యూనిస్టులారా.. ఆలోచించండి!

పునరేకీకరణ కోసం ముందుకు రండి!!



మాలోతు సాగర్
రాజకీయ సామాజిక విశ్లేషకులు
సెల్ నెంబర్ 7013805411

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.